నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, బుధవారం 18 సెప్టెంబర్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY



భూత్పూర్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



నాగర్‌కర్నూల్ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## రైతులను ఒప్పించి పొలాలను తీసుకోవాలి

- కక్ష సాధింపు చర్యలు తగదు
- ప్రభుత్వం వందశాతం రుణమాఫీ చేశామనడం సిగ్గుచేటు
- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్, డిసెంబర్ 17 : ప్రభుత్వం రైతులను ఒప్పించి పొలాలను తీసుకోవాలని, బలవంతంగా లాక్కోకూడదని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. మంగళవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు లగచర్ల గిరిజన రైతులకు న్యాయం చేయాలని కోరుతూ పార్టీ ఆధ్వర్యంలో భూత్పూర్‌లో నిరసన చేపట్టి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆల మాట్లాడుతూ ఎన్నికల్లో అమలుకాని హామీలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు, రుణమాఫీని ఈ ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. 45 శాతం మందికి రుణమాఫీ చేసి వంద శాతం చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం భయపెట్టి పొలాలను తీసుకోవడం ప్రజాస్వామ్యంలో మంచి పద్ధతి కాదన్నారు. కేసీఆర్ హయాంలో 123 జీవో ప్రకారం రైతులను ఒప్పించి పొలాలను తీసుకున్నారని గుర్తు చేశారు. లగచర్ల గిరిజన రైతులు తమకు బతుకుదెరువు లేకుంటదని పొలాలివ్వమంటే.. ప్రభుత్వం కక్షసాధింపుతో అక్రమ కేసులను పెట్టి 40 రోజులుగా జైల్లో పెట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగించడం సరికాదని హితవు పలికారు. లగచర్ల రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందన్నారు. కేసీఆర్ అప్పులు చేశారని సీఎం రేవంత్‌రెడ్డి బద్నాం చేస్తున్నాడు.. తాము పదేండ్లల్లో చేసింది రూ.4 లక్షల కోట్ల అప్పు మాత్రమేనన్నారు. పాలమూరు-రంగారెడ్డి, కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కొత్త గ్రామ పంచాయతీ భవనాలు వంటి అభివృద్ధిని పట్టించుకోకుండా కేవలం అప్పులపై మాత్రమే మాట్లాడడం తగదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, కౌన్సిలర్లు బాలకోటి, రామకృష్ణ, కోఆప్షన్ సభ్యులు అజీజ్, జాకీర్, సత్యనారాయణ, నాయకులు అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రమౌళి, నారాయణగౌడ్, సత్యనారాయణ, నర్సింహాగౌడ్, వెంకటయ్య, ఆంజనేయులు, శ్రీను, యాదయ్య, మురళీధర్‌గౌడ్, సాయిలు, అశోక్‌గౌడ్, రాములు, మందడి సరోజ్‌రెడ్డి, సురేశ్, యాదిరెడ్డి, ప్రేమ్, వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, లక్ష్మయ్య పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

- లగచర్ల బాధితులకు అండగా బీఆర్‌ఎస్ శ్రేణులు
- ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా ఆందోళన
- అరెస్టయిన వారిని విడుదల చేయాలని డిమాండ్
- ఊరూరా అంబేద్కర్ విగ్రహానికి వినతుల వెల్లువ
- జిల్లా కేంద్రాల్లో నినాదిస్తూ.. నిలదీస్తూ.. ర్యాలీలు
- హాజరైన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఆల
- రైతన్నలపై పెరుగుతున్న అరాచకాలపై భగ్గు

# నిరసనల హోరు

*లగచర్ల రైతుల అక్రమ జైలు నిర్బంధంపై బీఆర్‌ఎస్ భగ్గుమన్నది. వారిని అరెస్టు చేయడంతోపాటు థర్డ్ డిగ్రీ ప్రయోగించడం.. రైతు చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అమానవీయ.. అణిచివేత విధానంపై ఆగ్రహం వ్యక్తమైంది. దీంతో మంగళ వారం ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా నిరసనలు హోరెత్తాయి. ఊరూరా అంబేద్కర్ విగ్రహాలకు వినతులు వెల్లువెత్తాయి. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రాల్లో గులాబీ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ర్యాలీల జోరు కొనసాగింది. రేవంత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. ప్రభుత్వ వైఖరిని నిలదీస్తూ నిరసన చేపట్టారు. పలువురు నేతలను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. పాలమూరులో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, భూత్పూరులో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. పేద దళిత, గిరిజన రైతులు తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములను బలవంతంగా లాక్కొని ఫార్మా కంపెనీకి దోచిపెట్టే కుట్ర సాగుతున్నదని మండిపడ్డారు. రైతులపై నమోదు చేసిన కేసులను ఎత్తేసి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏడాది కాలంగా రైతులను, ప్రజలను మోసం చేస్తున్న సర్కారును అడుగడుగునా నిలదీయాలని పిలుపునిచ్చారు.*

*- నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, డిసెంబర్ 17*

- లగచర్ల రైతులపై అక్రమ కేసులెత్తేయాలి
- టెర్రరిస్టుల్లాగా రైతుకు బేడీలు వేసి దవాఖానకు తీసుకుపోవడం సిగ్గుచేటు
- స్వయంగా కలెక్టరే దాడి జరగలేదన్నారు..
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- మహబూబ్‌నగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతి

## భూములివ్వమంటే జైల్లో పెడతారా?

మహబూబ్‌నగర్ అర్బన్, డిసెంబర్ 17 : ఫార్మా సెజ్‌కు తమ భూములు ఇవ్వమని చెప్పిన లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు బనాయించి జైల్లో పెడతారా అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. బేషరతుగా ప్రభుత్వం రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేసి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మాజీ మంత్రి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా.. ఉన్న హామీలను తుంగలో తొక్కి ప్రశ్నించిన వారిని జైల్లో పెడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఎస్సీ, ఎస్టీ ప్రజల భూములు గుంజుకోమని చెప్పి అధికారం చేపట్టాకా లగచర్ల ఎస్టీ పేద రైతుల భూములు గుంజుకొని మాట తప్పారన్నారు. తమ ప్రాణాలు పోయినా తమ భూములు ఇవ్వమని తేల్చి చెప్పినందుకు.. కలెక్టర్‌పై దాడి చేశారంటూ అక్రమంగా కేసులు బనాయించి జైల్లో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వయంగా కలెక్టర్ తనపై దాడి జరగలేదని చెప్పినా ఈ ప్రభుత్వం పట్టించుకోకుండా రైతులను విచారించాలని చెప్పి జైలుకు పంపించారని ఆరోపించారు. రైతులు ఎవరిపై దాడి చేశారని నలభై రోజులుగా బెయిల్ ఇవ్వకుండా జైల్లో పెట్టారని ప్రశ్నించారు. ఓ రైతుకు గుండెపోటు వస్తే టెర్రరిస్టులాగా బేడీలు వేసి దవాఖానకు తీసుకువచ్చి చికిత్సలు చేయిస్తారా? ఇలాంటి పద్ధతి దేశంలో ఎక్కడైనా ఉందా? అని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రశ్నించిన వారిపై దాడులకు పాల్పడుతున్నారని, నిలదీస్తే జైల్లో పెడుతున్నారని, ఇదేనా కాంగ్రెస్ చెప్పిన ప్రజాపాలన అంటే అని మండిపడ్డారు. హామీలను నెరవేర్చకుండా విజయోత్సవ సంబురాలను నిర్వహించుకోవడం శోచనీయమన్నారు. ప్రజలు తిరగబడక ముందే ప్రభుత్వం తమ విధానాలను మార్చుకోవాలని, లేదంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సీఎం సొంత నియోజకవర్గం అంటే జిల్లాతోపాటు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు ఆదర్శంగా ఉండాలి. కానీ పేదల భూములు గుంజుకొని కంపెనీలు ఏర్పాటు చేస్తామని రైతులను ఇబ్బందులకు గురిచేస్తే వారితో కన్నీళ్లు పెట్టిస్తే అక్కడ ఆ కంపెనీ నిలుస్తుందా? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన వైఖరి మార్చుకొని రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని లేదంటే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు. త్వరలోనే జమిలీ ఎన్నికలు రాబోతున్నాయని, అంతలోపే హామీలను అమలు చేయాలన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను జైలుకు పంపుతాం అంటే కేసులకు భయపడేవారెవరూ లేరని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, పట్టణ అధ్యక్షుడు శివరాజ్, నాయకులు ఆంజనేయులు, కరుణకర్‌గౌడ్, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జంబులయ్య, సుధాకర్, పాలసత్తి, ఆకుల శివ, రమేశ్‌నాయక్, కిషన్‌పవర్ తదితరులు పాల్గొన్నారు.




మహబూబ్‌నగర్‌లో బోనాలతో ర్యాలీగా వెళ్తున్న ఎస్ఎస్‌ఏ ఉద్యోగులు

## హామీ నిలబెట్టుకోవాలి

- ప్రభుత్వానికి ఎస్ఎస్‌ఏ ఉద్యోగుల డిమాండ్
- ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న సమ్మె
- పాలమూరులో బోనాలతో బైలెల్లి.. కందనూలులో కండ్లకు గంతలు కట్టుకొని.. వనపర్తిలో వినూత్న వేషధారణలో..
- మద్దతు తెలిపిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

*సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మె కొనసాగుతున్నది. ఏండ్లుగా శ్రమ దోపిడీకి గురవుతున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రోజుకో విధంగా వినూత్న రీతిలో నిరసనలు చేపడుతున్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని దీక్షా శిబిరం నుంచి మహిళా ఉద్యోగులు బోనాలతో బైలెల్లి ఎల్లమ్మ ఆలయానికి చేరుకొని తల్లికి నైవేద్యం సమర్పించారు. ఉద్యోగుల ఆందోళనకు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మద్దతు తెలిపారు. అలాగే నాగర్‌కర్నూల్‌లో ఉద్యోగులు కండ్లకు నల్లగుడ్డలు కట్టుకోగా.. వనపర్తిలో వినూత్న వేషధారణతో సమ్మెలో పాల్గొన్నారు. గద్వాలలో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.*

*- నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, డిసెంబర్ 17*



నాగర్‌కర్నూల్‌లో కండ్లకు గంతలు కట్టుకొని ఉద్యోగుల నిరసన



మహబూబ్‌నగర్‌లో మద్దతు తెలిపిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



ధర్నా వద్ద రోడ్డుపైనే భోజనం చేస్తున్న రైతన్న

# అన్నదాతల ఆగ్రహం

- కందుల ధర తగ్గడంపై కన్నెర్ర
- నారాయణపేటలో ఐదు గంటల పాటు రాస్తారోకో..
- కిలోమీటర్ల మేర స్తంభించిన ట్రాఫిక్
- ఖరీదుదారులతో అధికారుల చర్చలు
- సోమవారం ధరపై రూ.250 పెంపుతో శాంతించిన రైతులు
- ఆకలి తట్టుకోలేక రొట్టెలు తెప్పించుకు తిన్న రైతులు



రోడ్డుపైనే కూర్చొని రొట్టెలను తింటున్న రైతులు

నారాయణపేట, డిసెంబర్ 17 : గత శనివారంతో పోలిస్తే సోమవారం ఒక్క రోజే నారాయణపేట వ్యవసాయ మార్కెట్లో ఒకే సారి కంది క్వింటాపై రూ.2వేలకు పైగా ధర పడిపోవడంతో సోమవారం రైతులు ఉన్న ఫలంగా మొదలు పెట్టిన ఆందోళనను మంగళవారం సైతం కొనసాగించారు. సోమవారం ఆందోళనతో నిలిచిపోయిన కొనుగోళ్లలో కొంత మంది రైతులు తమ తమ ఇండ్లకు వెళ్లిపోగా మిగిలిన రైతులు మార్కెట్ యార్డులో ధాన్యం కుప్పల వద్దే నిద్రపోయారు. మంగళవారం మార్కెట్ యార్డుకు కందుల విక్రయానికి వచ్చిన రైతులు, నిన్నటి రైతులతో కలిసి ధర పెంచాలని డిమాండ్ చేశారు. రైతులకు మద్దతుగా రైతు సంఘాల నాయకులు, కమ్యూనిస్టు పార్టీల నాయకులు అధికారులతో చర్చలు జరిపారు. సోమవారం ఖరీదుదారులు చెప్పిన క్వింటాకు రూ.100 ధర పెంపు విషయమే మళ్లీ అధికారులు చెప్పడంతో సోమవారం టెండర్‌లో పలికిన ధరకు క్వింటా వెంబడి రూ.500 పెంచి ఇవ్వాలని రైతులు పట్టుబట్టారు. అందుకు ఖరీదుదారులు ఒప్పుకోకపోవడంతో కొంత మంది రైతులు వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట ప్రధాన రహదారిపై, మరి కొందరు రైతులు అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నాకు దిగారు. కలెక్టర్ రావాలి తమ సమస్యలను పరిష్కరించాలని, రెండు రోజులుగా ఆందోళన చేపడుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టుగా లేదని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వ్యాపారులంతా సిండికేట్‌గా మారి తమకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ధర్నా మొదలైన దాదాపు గంటన్నర తర్వాత ఆర్డీవో రామచందర్ అంబేద్కర్ చౌరస్తా వద్దకు చేరుకొని రైతులతో మాట్లాడారు. రైతుల డిమాండ్‌పై మార్కెట్ అధికారులు, ఖరీదుదారులతో చర్చిస్తానని గంట సమయం ఇవ్వాలని అంత వరకు ధర్నా విరమించాలని కోరడంతో అంబేద్కర్ చౌరస్తా వద్ద రైతులు ధర్నా విరమించి, మార్కెట్ యార్డు వద్ద చేపడుతున్న ఆందోళన వద్దకు చేరుకున్నారు. అక్కడ కూడా ఇదే విషయం చెప్పేందుకు ఆర్డీవో ప్రయత్నించగా అందుకు రైతులు ఒప్పుకోలేదు. ఏదైనా తమముందే మాట్లాడాలని, అది కూడా ఇక్కడ రోడ్డు మీదే చెప్పాలనని పట్టుబట్టి రాస్తారోకోను కొనసాగించారు. మరోవైపు వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యాలయంలో మార్కెట్ చైర్మన్ సదాశివరెడ్డి అధ్యక్షతన మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్, మార్కెటింగ్ శాఖ ఏడీఎం బాలమణి, రైతు సంఘాల నాయకులు ఖరీదు దారులతో చర్చలు జరిపారు. రైతులు డిమాండ్ చేస్తున్నట్లుగా క్వింటాకు రూ.500 పెంచి ఇవ్వలేమని అలా చేస్తే తీవ్రంగా నష్టపోతామని ఖరీదుదారులు తేల్చి చెప్పారు. సోమవారం జరిగిన చర్చల్లో చెప్పినట్లుగానే కింటాపై రూ.100 మాత్రమే పెంచి ఇస్తామని మరోమారు చెప్పారు. అలా కాదని సోమవారం టెండర్లో పలికిన ధరపై క్వింటాలకు రూ.225 పెంచి ఇవ్వాలని అధికారులు ఖరీదుదారులకు నచ్చజెప్పారు. ఇదే విషయాన్ని అధికారులు, మార్కెట్ చైర్మన్లు రాస్తారోకో వద్దకు చేరుకొని రైతులకు ఖరీదుదారులతో జరిగిన చర్చల విషయాన్ని వారు చెప్పిన రూ.225 రూపాయల విషయాన్ని చెప్పారు. అందుకు కూడా రైతులు ఒప్పుకునేది లేదని కనీసం రూ.400 అయినా పెంచి ఇవ్వాలని పట్టుబట్టారు. అన్ని మార్కెట్లలోనూ కందుల ధర ఒక్కసారిగా పడిపోయాయని అందులో భాగంగా నారాయణపేట లో కూడా కందుల ధర తగ్గిందని చివరగా క్వింటాకు రూ.250 రూపాయలు పెంచి ఇస్తామని రైతులకు నచ్చచెప్పడంతో రైతులు శాంతించి రాస్తారోకోను విరమించారు.



నారాయణపేట మార్కెట్ యార్డు ఎదుట రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపడుతున్న రైతులు

### ప్రయాణికులకు తిప్పలు..

మంగళవారం ఉదయం 11:30 గంటల నుంచి సాయంత్రం నాలుగున్నర గంటల వరకు ఏకాధాటిగా దాదాపు ఐదు గంటల పాటు రైతులు రాస్తారోకో నిర్వహించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రాస్తారోకో కారణంగా వాహనాలు కిలోమీటర్ల దూరంలో నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సులను మాత్రం పగిడిమర్రి, ఓబులాపూర్ మీదుగా ఊట్కూర్ రహదారిపై అటు నుంచి సింగారం చౌరస్తా మీదుగా మహబూబ్‌నగర్, హైదరాబాద్ బస్సులను నడిపించారు. ఇక ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు బీసీ కాలనీ మీదుగా బాబాకాలనీ వైపు నుంచి వెళ్లాయి. లారీలు మాత్రం రెండు మార్గాల్లో పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. దాదాపు 5 గంటల పాటు రైతులు రాస్తారోకో చేపట్టినప్పటికీ పోలీసులు, మార్కెటింగ్ అధికారులు, ఆర్డీవో ఎంతో ఓపికగా సంయమనం పాటించి ఆందోళన పక్కదారి పట్టకుండా ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నారు.



రాస్తారోకో చేయడంతో ఎక్కడికక్కడ నిలిచిన వాహనాలు





రైతులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నిస్తున్న అధికారులు, రైతులను అడ్డుకుంటున్న పోలీసులు